విద్యార్థుల్లో కరాటేపై ప్రత్యేక శ్రద్ధ

శిక్షణల్లో విద్యార్థినులే అధిక శాతం

పాలకొల్లు సెంట్రల్: గతంలో చిన్నారులు, యువకులు సమయం దొరికితే వ్యాయామం చేయడానికి, ఆటలు ఆడడానికి అధిక ప్రాధాన్యతనిచ్చేవారు. రానురానూ పిల్లల్లో ఆటలు, వ్యాయామం తగ్గి ఉదయం నుండి రాత్రి వరకూ చదువుకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఒక వేళ సమయం దొరికిందంటే చాలు సెల్‌ఫోన్‌లకే పరిమితమవుతున్నారు. పాఠశాలల్లో కూడా గతంలో వారానికి మూడు రోజులు డ్రిల్, క్రీడలు ఏర్పాటు చేసేవారు. నేడు ఏ పాఠశాలల్లోనూ ఆ డ్రిల్, ఆటలు పెద్దగా కనిపించడంలేదు. తద్వారా విద్యార్థుల్లో శారీరక ధృడత్వం, మానశిక ఉల్లాసం, శారీరక వ్యాయామం లేకుండా పోతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలను కరాటేపై దృష్టి మళ్లించే విధంగా ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. ఒకరిని బట్టి ఒకరు విద్యార్థులు కరాటేపై మక్కువ చూపిస్తున్నారు. కొన్నికొన్ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా కరాటేకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. గతంలో కరాటే నేర్చుకోవడానికి అబ్బాయిలే ఎక్కువ సంఖ్యలో ఉండేవారు అరకొరగా అమ్మాయిలు ఉండేవారు. నేటి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. నేడు అబ్బాయిలకన్నా అమ్మాయిలే కరాటేకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు.


కరాటే శిక్షణలో డీఎన్నార్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు


పోటీపడుతున్న చిన్నారులు

కరాటేలో 10 బెల్టులు
కరాటేలో వైట్, ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్‌-4, బ్రౌన్‌-3, బ్రౌన్‌-2, బ్రౌన్‌-1, ప్రొఫెషనల్ బ్లాక్ బెల్ట్ కోసం శిక్షణ తీసుకుంటున్నారు. కరాటే శిక్షణ వల్ల ఉద్యోగాల్లో చేరికకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రతీ రోజూ స్కూల్స్, ప్రైవేటు శిక్షణా క్లాసుల్లో కలిపి సుమారు 800 మంది విద్యార్థులు ఈ శిక్షణల్లో పాల్గొంటున్నట్లు సమాచారం.

కరాటేతో ఆత్మరక్షణ

ప్రస్తుత పరిస్థితుల్లో కరాటే అనేది ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని మా అమ్మ చెబుతుంది. దీంతో రోజూ వచ్చి శిక్షణ తీసుకుంటున్నాను. ఎప్పటికైనా బ్లాక్ బెల్ట్ సాధించగలననే నమ్మకం ఏర్పడింది. ఆపద సమయంలో తప్ప మరెక్కడా ఎవరిమీదా ప్రయోగించకూడదని శిక్షణలో కోచ్ చెబుతూ ఉంటారు.

జి. సాహిత్య, 1వ విద్యార్థిని, పాలకొల్లు

కరాటేతో ధైర్యం

కరాటే నేర్చుకోవడం మొదలు పెట్టిన నాటి నుంచి నాలో ఒకరకమైన ధైర్యం ఏర్పడింది. ఉదయాన్నే 5.30 గంటలకు లేచి కరాటే శిక్షణకు వెళుతున్నాను. కరాటేలో పూర్తి శిక్షణ పొంది స్పోర్ట్స్ కోటాలో ఏదైనా ఉద్యోగం సాధించాలనే కోరిక ఉంది. ఇప్పటికే మూడు స్టేట్ టోర్నమెంట్లు, ఒక నేషనల్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించాను.

– ఎం.లాస్య, 5వ తరగతి విద్యార్థిని

ఉద్యోగ సాధన కోసమే.

ఒక నేషనల్, రెండు స్టేట్ టోర్నమెంట్లలో గోల్డ్ మెడల్ సాధించాను. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాలనే ఏకైక లక్ష్యంతో కరాటేలో శిక్షణ పొందుతున్నాను. వారానికి మూడు రోజులు కరాటే శిక్షణ ఇస్తుంటారు. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా మానసికంగా, శారీరకంగా చాలా ఉల్లాసంగా ఉంటుంది.

– బి. సౌజన్య, 8వ విద్యార్థిని,

తల్లిదండ్రుల ఆసక్తితో..

తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటేలో శిక్షణ ఇప్పించడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. పట్టణంలో దేవునిహాలులో నిత్యం శిక్షణ ఇస్తున్నాం. డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అలాగే పట్టణంలో ఉన్న ఆరు మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తుంటాం.

– ధనాని సూర్య ప్రకాష్, కరాటే ఇన్‌స్ట్రక్టర్, పాలకొల్లు

బాల్య వివాహాలపై అవగాహన


పెనుగొండలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్తేరు రాణి

పెనుగొండ: ఎక్కడా, ఎటువంటి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలు ప్రోత్సహించకుండా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకునే విధంగా కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు రాణి అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధక చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. బాల్య వివాహాలు వల్ల జీవితంలో ఎదుగుదల తగ్గి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి, గంటా సరస్వతి పాల్గొన్నారు.

పెట్టుబడులతో యువతకు మరింత ఉపాధి

పెనుగొండ: రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తల పెట్టుబడుల వెల్లువతో యువతకు మరింత ఉపాధి కలుగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం సిద్ధాంతంలో బస్టాండు సెంటర్, తానేష్ పాలెం, కొబ్బరి తోట పాలెంల్లో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. సీఎం జగన్ సమర్థవంతమైన విధానాలు, పారదర్శక, సంక్షేమ పాలనతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రబాట పట్టారని తెలిపారు. రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవ వేత్తలు సంసిద్ధత వ్యక్తం చేశారని, తద్వారా 6 లక్షలకు పైగా ఉద్యోగాలు స్థానిక యువతకు లభిస్తాయన్నారు. ఇప్పటికే లక్షలాది ఉద్యోగాలు కల్పించిన సీఎం జగన్ యువతకు మరింత అండగా నిలవనున్నారన్నారు. దీంతో చంద్రబాబు అండ్ కో ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టాలన్న కుటిల యత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మూడేళ్ల పాలనలో అవినీతికి తావివ్వకుండా పాలన సాగించడంతో పారిశ్రామిక వేత్తలకు నమ్మకం కలిగిందన్నారు. సీఎం జగన్‌పై పూర్తి స్థాయిలో నమ్మకం ఉంచి ముందుకు వచ్చారన్నారు. దీంతో సంక్షేమంతో పాటు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందనుందన్నారు. సీఎం జగన్‌ను ప్రజలు అందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, సోసైటీ అధ్యక్షుడు కేశవరపు గణపతి, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, బాలం సత్తిరాజు, గ్రామ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, చింతపల్లి ప్రసాద్, కుడిపూడి రామకృష్ణ, బలువు కేదారి, నక్కా కృష్ణ, సుంకర నాగబాబు, రొక్కాల శ్యామ్యూల్, నక్కా బోస్, నక్కా శ్రీను, రొక్కాల ధనరాజు, మానేపల్లి చంటి, ఊటాల వెంకన్న, గెడ్డం వెంకట్రావు, మాకా భాస్కరరావ, మానుపాటి భీముడు పాల్గొన్నారు.


సిద్ధాంతంలో లబ్ధిదారులకు సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

పాలకొల్లు అర్బన్: నిరుపేదల ఇంటి నిర్మాణాలు చకచకా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. శనివారం ఆమె కొంతేరు జగనన్న లేఅవుట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లలో మౌలిక వసతులు త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణాల్లో ప్రతీ రోజు పురోగతి కనిపించాలన్నారు. పునాదుల నుంచి స్లాబు వరకు ప్రతీ రోజు ప్రగతి కనిపించే విధంగా లబ్ధిదారులను తొందరపెట్టాలన్నారు. జగనన్న లేఅవుట్‌లలో అవసరమైన చోట బ్రిక్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.పిచ్చయ్య, హౌసింగ్ డీఈ రామాయణం త్రిమూర్తులు, తహసీల్దార్ లక్కు నరసింహరావు తదితరులు ఉన్నారు.

పెనుమంట్రలో..
పెనుమంట్ర: మండలంలో గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖ డీఈ ఎంవీఎస్ గోపాలరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇళ్ల నిర్మాణ విషయంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ విషయంలో స్థానిక అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి, ఏఈ ఏకే మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరులో..
మొగల్తూరు: జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి వి విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం హౌసింగ్‌డే సందర్భంగా మండలంలోని పేరుపాలెం నార్త్‌లోని అంబేద్కర్ కాలనీ,దేవుని తోటలలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ జి.అనిత కుమారి, ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ ఫణీంద్ర ఉన్నారు.


కొంతేరు లే అవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి


పేరుపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి

సిద్ధాంతం సమస్యలపై ప్రత్యేక దృష్టి

పెనుగొండ: దేవాదాయ శాఖ నిధులు, దాతల సహకారంతో సిద్ధాంతం కేదారీఘాట్ శ్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు, సిద్ధాంతం సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం సిద్ధాంతం కేదారీఘాట్‌లో గ్రామ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. తొలి విడతగా రూ. 65 లక్షల నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు దాతల సహకారంతో అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికలో 8 ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఘాట్‌లో ఆరు ప్లాట్ ఫాంలు, వరదల సమయంలో వినియోగించుకునేందుకు ఏటిగట్టుపై రెండు ప్లాట్ ఫామ్‌లు , టాయిలెట్స్, గదులు, విశ్రాంతి గదులు, పార్థివదేహాలకు స్నానం చేయించడానికి ప్రత్యేక గది చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నల్లపరాజు వేణుగోపాల ఆదినారాయణ రాజు(దొరబాబు), మాజీ సర్పంచ్ ఉండవల్లి సత్యనారాయణ (చిన్ని), ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, సుతాపల్లి సత్తిబాబు, బొబ్బిలి శ్రీను, దార్లంక శివరామకృష్ణ పాల్గొన్నారు.


సిద్ధాంతం గరగాలమ్మ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన
ప్రతి వర్షాకాలంలోనూ ఇబ్బందులు పాలు చేస్తున్న సిద్ధాంతం గరగాలమ్మడ్రయిన్ ప్రక్షాళన చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఆక్రమణల వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సత్వరం ఆక్రమణలు తొలగించి, డ్రెయిన్ ప్రక్షాళన చేపట్టాలన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ రథోత్సవం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి పట్టణ రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి వేద పండితులతో వేద పారాయణం, కుంకుమపూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి పట్టణ ఊరేగింపు సందర్భంగా ముందుగా వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, రాజరాజేశ్వరి దంపతులతో కుంభం ఏర్పాటుచేశారు. అనంతరం రథం లాగి ఊరేగింపును ప్రారంభించారు. వివిధ సన్నాయి వాయిద్యాలతో, గరగల నృత్యాల, తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ కనకదుర్గమ్మను దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు కార్యక్రమంలో ఈఓ ఎస్.సతీష్‌కుమార్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, క్షీరారామలింగేశ్వరస్వామి, అష్టభుజ లక్ష్మీ నారాయణస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న గుణ్ణం నాగబాబు

అబ్బురపరిచేలా కల్యాణ వేదిక


కలగంపూడి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు–శారదావాణి దంపతుల కుమార్తె డా.సింధు–డా.అనిర్వాణ్ణా వివాహ వేడుకకు సిద్ధం చేసిన కల్యాణ వేదిక బాహుబలి సినిమాను తలపిస్తుంది. తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ వేదిక నమూనాతో బంగారు రంగు ప్రాకారాలతో చూపరులను ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. ఇంకా రంగురంగుల పుష్పాలతో కల్యాణ వేదికను అలంకరిస్తున్నారు. ఈ సెట్టింగ్ వేయడానికి సుమారు 48 గంటల సమయం పట్టిందని చెబుతున్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ వివాహానికి ఆదివారం సాయంత్రం హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నారు.

స్వర్ణాంధ్రలో ముగిసిన సంయుక్త్ 2కే23

నరసాపురం రూరల్: విద్యార్థులు చదువుతోపాటు సమాజంతో అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు నిరంతరం శ్రమించాలని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ అన్నారు. శనివారం కళాశాలలో జరిగిన సంయుక్త్ 2కే23 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఈవెంట్స్ ప్రదర్శనల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లోను ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ట్రెజరర్ కొండేటి త్రినాథ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పండరీనాథ్ పాల్గొన్నారు.


ఆకట్టుకున్న స్వర్ణాంధ్ర కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

వ్యక్తిత్వ వికాసంపై సదస్సులు


మాట్లాడుతున్న ఆర్.పార్థసారథి

నరసాపురం: వైఎన్ కళాశాలలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సమైక్యతదా శిబిరంలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై రెండు సదస్సులు నిర్వహించారు. నైతిక విలువలు అనే అంవంపై కళాశాల పీజీసెంటర్ ఇన్‌చార్జ్ ఆర్.పార్థసారథి, మన స్వత్వ నిర్వహణ అనే అంశంపై హెచ్‌ఆర్డీ సెంటర్ కన్వీనర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్‌లు మాట్లాడారు. నైతిక విలువలు నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండటం ద్వారా జీవితంలో విజయాలు చూడొచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏవీవీ అప్పారావు, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎస్ చింతారావు, ఎన్ఎస్ఎస్ అధికారులు యాకోబ్, వంశీ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవాలు

పెనుగొండ: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరువార్షిక కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రామలింగేశ్వర శర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు తిలకించడానికి పరిసర ప్రాంతాలను భక్తులు భారీగా తరలి వచ్చారు. కల్యాణోత్సవం శ్రీమాన్ ఖండవల్లి సూర్యనారాయణ ఆచార్యులు శిష్య బృందం కమనీయంగా కనుమూరి సత్యనారాయణ రాజు, వెంకట సుభద్రాదేవి దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దండు సూర్యనారాయన పార్వతి దంపతులు, చింతలపాటి సూర్యనారాయణరాజు వెంకట సత్యరాజేశ్వరి దంపతులు పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


పర్యావరణ పరిరక్షణ బ్యానర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మన భూమి, గాలి కలుషితం కాకుండా ప్రతి పౌరుడూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముచ్చర్ల సత్యనారాయణ తెలిపారు. శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించగలిగితే సగం పర్యావరణాన్ని కాపాడినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, క్లబ్ సెక్రటరీ చల్లా ఆదినారాయణ, ట్రెజరర్ మాగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి


మొగల్తూరులో మాట్లాడుతున్న బాల సత్యనారాయణ

మొగల్తూరు: చట్టాలు, హక్కులపై మహిళలు అవగాహన కల్పించుకోవాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామన బాల సత్యనారాయణ సూచించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర న్యాయ సేవాధికా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డ్వాక్రా భవనంలో న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచ్ పడవల మేరీ, ఉచిత న్యాయవాదులు నారిన శ్రీనివాసరావు, ఇంజేటి జాన్ కెనడీ, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, నక్కా ఆనంద్ బాబు, డి చాముండేశ్వరి,వెలుగు ఏపీఎం సుభాషిణి, పారా లీగల్ వలంటీర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పునఃప్రతిష్టాపనోత్సవాలు


మహా అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో 120 ఏళ్ల చరిత్ర ఉన్న శ్రీ కోదండ రామాలయం పునఃప్రతిష్టాపనోత్సవాలు ముగిశాయి. ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, శిరీష దంపతుల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద మహా అన్న సమారాధన నిర్వహించారు. 10 వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చేగొండి రామకష్ణ, పాలంకి వరప్రసాద్, కోటిపల్లి ఆనంద రావు, నంద్యాల బాబు, అధికారి సతీష్, కోటిపల్లి ప్రభాకర్, గుడివాడ ప్రభాకర్, కోటిపల్లి దొర్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా కేశవస్వామి కల్యాణం


భట్లమగుటూరులో కేశవస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని భట్లమగుటూరు గ్రామంలో ఉన్న శ్రీకేశవ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ఈఓ పీటీ గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలలో ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరత్నమ్మ మృతి


వెంకటరత్నమ్మ

పెనుమంట్ర: జుత్తిగ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి వెంకటరత్నమ్మ(90) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి తదితరులు ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పోడూరు: దంతాల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని పాలకొల్లుకు చెందిన వీరా మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ వైద్యురాలు మల్లుల జ్ఞానేశ్వరి పిలుపునిచ్చారు. వీరా డెంటల్ క్లినిక్, విశ్వమానవ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వేడంగి ప్రాథమిక పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 81 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వమానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్, పాఠశాల హెచ్‌ఎం గెద్దాడ పెద్దిరాజు, పీఎంసీ చైర్మన్ శాంతి, వైస్‌చైర్మన్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సీఎం జగన్ దక్షతతోనే పెట్టుబడులు


బుడితి సుమన్

నరసాపురం: విశాఖపట్టణంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో రాష్ట్రంలో లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు ముందురావడంపై వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా కన్వీనర్ బుడితి సుమన్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్షతకు ఇది నిదర్శమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు అంటూ టీడీపీ కార్యకర్తలతో ఎంవోయూలు కుదుర్చుకుందని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖేష్ అంబానీలాంటి దిగ్గజ పారిశ్రామిక వేత్తలను రాష్ట్రానికి రప్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు.

దిగమర్రులో రథోత్సవం


దిగమర్రులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన దిగమర్రులోని శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన నంది వాహనంపై కల్యాణమూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా రథం ముందు కుంభం పోసి గుమ్మడికాయ దిష్టి తీసి నందివాహనాన్ని కదిలించారు. ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ, అర్చకస్వామి చేబ్రోలు శ్రీనివాస రామమూర్తి, చేబ్రోలు బాలకృష్ణ గాంధీ, ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, బెజవాడ వెంకటేశ్వరరావు, తమ్మినీడి సూర్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.